5

# “లేచి, బాప్తిస్మము పొందుము” (2)

సంవత్సరాల క్రింతం, మూడు కాళ్ల పీటలు సాధారణంగా వాడుకలో ఉండేయి. మూడు కాళ్ల ఎత్తు పీటను నీ మనస్సులో చిత్రించుకో. అప్పుడు, ఆ కాళ్లలో ఒకటి ఊడిపోయిందనుకో. అప్పుడు ఏమి జరుగుతుంది? (నా మనస్సులో, ఆ విరిగిపోయిన కాళ్ల పీటమీద కూర్చుండి సమదృష్టి పెట్టుతూ ఆవు పాలు పితుకుతూ ఉండగా, అతడు దొర్లి పడినట్టును, పాల బక్కెట్ దొర్లుకొంటూ పోయినట్టును నేను చూస్తున్నాను!) వాస్తవంగా మూడు కాళ్ల పీట రెండు కాళ్లమీద నిలువదు.

లేఖనానుసారమైన బాప్తిస్మం మూడు విషయాలతో కూడియుంది: అది సరియైన విధానంలో జరిగించాలి (బాప్తిస్మం “ఎలా” అనే దాని విషయంలో); సరియైన కారణాన్ని బట్టి అది చేయాలి (“ఎందుకు”); సరియైన వ్యక్తికే అది జరిగించాలి (“ఎవరు”). ఈ మూడు విషయాలు ముక్కాల పీటలోని మూడు కాళ్లను పోలియున్నాయి: ప్రతి ఒక్కటి అవసరమే; ప్రతి ఒక్కటి తప్పనిసరి.

గత పాఠంలో, బాప్తిస్మం “ఎందుకు?” అనే దానితో మన చర్చను ప్రారంభించాం. ఈ పాఠంలో ఆ చర్చను సంపూర్తి చేస్తాం, మరియు “ఎలాగు?” “ఎవరు?” అనే ప్రశ్నలను కూడా చర్చించుదాం.

## బాప్తిస్మం: “ఎందుకు?”

గత పాఠం చదివి కొంత సేపయ్యింది కదూ, బాప్తిస్మం యొక్క ఉద్దేశాన్ని గూర్చి మార్కు 16, మరియు అపొ. 2 ఏమి చెప్పుతున్నాయో పునరాలోచన చేయాలని నీవు కోరవచ్చు.

“బాప్తిస్మం ఎందుకు?” అనే ప్రశ్నకు యితర లేఖన భాగాలు కూడా జవాబిస్తాయి. కొన్నింటిని నేను క్రింద పేర్కొంటాను. ప్రతి దాని సందర్భాన్ని గమనించుతూ నీ యొద్దనున్న బైబిల్లో వాటిని చదవడానికి నిశ్చయం చేసికో:

**అపొ. 22:16:** సువార్తికుడు సౌలుకు యిలా చెప్పాడు, “నీవు తడవుచేయుట ఎందుకు? లేచి ఆయన నామమునుబట్టి ప్రార్థనచేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగివేసికొనుము.” పాపాన్ని కడిగివేసేది నీళ్లు కాదు; బాప్తిస్మం యిచ్చే స్థలంలోని నీళ్లలో ఏ గారడీ గాని పరిశుద్ధత గాని లేదు. క్రీస్తు యొక్క రక్తము పాపాలను కడిగివేస్తుంది (మత్తయి 26:28; ప్రకటన 1:5). బాప్తిస్మం పొందే సమయంలో యేసు రక్తము ఈ క్రియను జరిగిస్తుందని అపొ. 22 మనకు తెలుపుతుంది.

**గలతీ. 3:26, 27:** పౌలు గలతీయులకు యిలా చెప్పాడు, “యేసు క్రీస్తునందు మీరందరు విశ్వాసమువలన దేవుని కుమారులై యున్నారు” (26 వ.). “విశ్వాసమువలన దేవుని కుమారులు”గా వారు ఎప్పుడయ్యారు? పౌలు యిలా కొనసాగించి పలికాడు:

"క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొనియున్నారు" (27 వ.). నీవు దేవుని కుమారుడవు కాగోరితే, విశ్వసించి బాప్తిస్మం పొందవలసి యుంటావు. నీవు క్రీస్తులో ఒకడవు కావాలనుకుంటే, నీవు క్రీస్తులోనికి బాప్తిస్మం పొందవలసియుంది. క్రీస్తును నీవు ధరించుకోగోరితే, నీవు బాప్తిస్మం పొందాలి.

**1 పేతురు 3:21:** నోవహు అతనితో కూడ యింకను ఏడుగురు ఓడలో నిలిచి ఎలా రక్షింపబడ్డారో వివరించిన తరువాత పేతురు యిలా వ్రాశాడు, "దానికి సాదృశ్యమైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది; అదేదనగా శరీర మాలిన్యము తీసివేయుట కాదుగాని యేసు క్రీస్తు పునరుత్థాన మూలముగా దేవుని విషయము నిర్మలమైన మనస్సాక్షి నిచ్చు ప్రత్యుత్తరమే." బాప్తిస్మం యొక్క ఉద్దేశము స్నానం చేసి దేహాన్ని శుద్ధి చేసికొనడం కాదు.[2] కాని, బాప్తిస్మం అనేది దేవుని పట్ల హృదయం కనుపరచే ప్రతి స్పందనయే: "లేచి బాప్తిస్మం పొందు" అని దేవుడంటున్నాడు, అప్పుడు నా హృదయం "అవును!" అని అన్నది. గత పాఠంలో గుర్తించినట్టే, ప్రభువైన యేసు యొక్క మరణము, సమాధి, పునరుత్థానములయందు విశ్వాసాన్ని వ్యక్తపరచేది బాప్తిస్మం.

"బాప్తిస్మము యిప్పుడు మిమ్మును రక్షించును" అనే మాటలు బహు బలమైనవి. బాప్తిస్మమనే కార్యంలోనే యోగ్యత ఉందని దీని అర్థం కాదన్న సంగతి యిప్పటికే నీవు గ్రహించియుండవచ్చు. మనలను మనం రక్షించుకోలేం, దేవుని కృపవలననే మనం రక్షింపబడాలి. ఏదియెలాగున్నా, దేవుడు చెప్పినది చేసినందున ఓడలోని జనులు రక్షింపబడినట్టే, దేవుడు ఆజ్ఞాపించిన దానిని మనుష్యులు చేసినప్పుడు వారు తమ పాపములనుండి రక్షింపబడతారు – బాప్తిస్మం పొందినప్పుడు. మన రక్షణకొరకైన ఆయన సంకల్పంలో దేవుడు దానిని చేర్చినందున "బాప్తిస్మము రక్షిస్తుంది."

ఇతర లేఖన భాగాలు మన జాబితాకు చేర్చబడవచ్చు, బాప్తిస్మమనే పదం ఉపయోగింపకుండ దానిని సూచించేవి – (యోహాను 3:3, 5; తీతు 3:5 లాంటివి). అయినా, "ఎందుకు?" అనే ప్రశ్నకు జవాబుగా యివ్వబడిన లేఖన భాగాలు సరిపోతాయని నిరీక్షిస్తున్నాను.

## బాప్తిస్మము: "ఎలా?"

"ఒకడు ఎలా బాప్తిస్మం పొందాలి?" అనే ప్రశ్నకు మళ్లుదాం. గత పాఠంలో, "బాప్తిస్మానికి" "ముంచడం" అనే గ్రీకు నిఘంటువు యొక్క నిర్వచనాన్ని గమనించాం. ఏదియెలాగున్నా, బాప్తిస్మం యొక్క కార్యాన్ని గ్రహించడానికి గ్రీకు తెలిసియుండాలని గాని, గ్రీకు నిఘంటువు కలిగియుండడం అవసరమని గాని నీ మనస్సులో నేను నాటింపజేయనుద్దేశించ లేదు. లేఖనాల్లో బాప్తిస్మం యొక్క చర్య స్పష్టంగా ఉంది.

### యోహానుచే బాప్తిస్మం (యోహాను 3; మత్తయి 3)

"సలీము దగ్గరనున్న ఐనోనను స్థలమున నీళ్లు విస్తారముగా ఉండెను గనుక యోహాను కూడా అక్కడ బాప్తిస్మమిచ్చుచుండెను" అని యోహాను 3:23 అంటుంది.

చిలకరింపుకు గాని, కుమ్మరింపుకు గాని తక్కువ నీళ్లు సరిపోతాయి, కాని యోహాను బాప్తిస్మానికి "విస్తారమైన నీళ్లు" అవసరమైయుంది.

యోహాను బాప్తిస్మానికి "విస్తారమైన నీళ్లు" ఎందుకు కావలసివచ్చిందంటే, అది నీటిలో ముంచడమైయుంది. యోహాను క్రీస్తుకు బాప్తిస్మం యిచ్చినప్పుడు, ప్రభువు వెంటనే "నీళ్లలోనుండి ఒడ్డునకు" వచ్చాడు (మత్తయి 3:16). నీళ్లలోనికి వెళ్లినట్టు (గుప్తం చేయబడి) మరియు నీళ్లలోనుండి ఒడ్డునకు వచ్చినట్టు (చెప్పబడింది) ముంచడం అనే కార్యంతో సత్ సంబంధం కలిగియుంది, చిలకరింపుతో గాని, పోయబడడంతో కాని పొసగనిదై ఉంటుంది.

**నోబుల్‌మన్ యొక్క బాప్తిస్మం (అపో. 8)**

ఐతియొపీయుడైన అధికారి యొక్క మార్పు మన మూడవ పాఠంలో పరిచయం చేయబడింది. ఆ అధికారి ప్రభువైన యేసునందు తన విశ్వాసాన్ని ఒప్పుకొన్నట్టు మనం చూచాం. ఆ తరువాత, మనం యిలా చదివాం,

> ... ఇదిగో నీళ్లు; నాకు బాప్తిస్మమిచ్చుటకు ఆటంకమేమని అడిగి రథము నిలుపుమని ఆజ్ఞాపించెను. ఫిలిప్పు నపుంసకుడు ఇద్దరును నీళ్లలోనికి దిగిరి. అంతట ఫిలిప్పు అతనికి బాప్తిస్మ మిచ్చెను. వారు నీళ్లలోనుండి వెడలి వచ్చినప్పుడు ప్రభువు ఆత్మ ఫిలిప్పును కొనిపోయెను, నపుంసకుడు సంతోషించుచు తన త్రోవను వెళ్లెను; అతడు ఫిలిప్పును మరి యెన్నడును చూడలేదు (అపో. 8:38, 39).

ఫిలిప్పు నపుంసకుడు ఇద్దరును "నీళ్లలోనికి దిగిరి" మరియు "నీళ్లలోనుండి వెడలి వచ్చిరి" అనే సంగతిని గుర్తించు. నేటి జనులవలె చిలకరించడంతో సరిపెట్టుకున్నట్టయితే, ఫిలిప్పు ఆ అధికారి యిద్దరును నీళ్లలోనికి దిగవలసిన అవసరం ఉండేది కాదు. మరల, ఆ కార్యము ముంచడంతో సత్ సంబంధం కలిగియుంది, చిలకరింపుతో గాని, పోయబడడంతో గాని పొసగనిదైయుంటుంది.

**బాప్తిస్మం సమాధిలా (రోమా 6; కొలస్సీ. 3)**

పౌలు యొక్క రచనలలో, బాప్తిస్మాన్ని "సమాధి చేయబడడంలా" సూచించాడు. రోమాలోని క్రైస్తవులకు అతడు యిలా వ్రాశాడు: "కాబట్టి తండ్రి మహిమవలన క్రీస్తు మృతులలోనుండి యేలాగు లేపబడెనో, ఆలాగే మనమును నూతనజీవము పొందినవారమై నడుచుకొనునట్లు, మనము బాప్తిస్మమువలన మరణములో పాలుపొందుటకై ఆయనతో కూడ పాతిపెట్టబడితిమి" (రోమా 6:4). "మీరు బాప్తిస్మమందు ఆయనతో కూడ పాతిపెట్టబడినవారై ఆయనను మృతులలోనుండి లేపిన దేవుని ప్రభావమందు విశ్వసించుట ద్వారా ఆయనతో కూడ లేచితిరి" అని అతడు కొలస్సీలోని క్రైస్తవులకు తెలిపాడు (కొలస్సీ. 2:12). సమాధి చేయబడిన కార్యక్రమాన్ని నీవు తిలకించి యుండవచ్చు. "చిలకరింపు, కుమ్మరింపు అనేదా లేక ముంచడమనేదా – పాతిపెట్టబడే భావాన్ని శ్రేష్ఠంగా చిత్రించ గలిగింది ఏది?" అని నీకు నీవే ప్రశ్నించుకో.

కావాలంటే క్రొత్త నిబంధన అంతటిని గాలించి చూడు: "బాప్తిస్మం పొందడం" అనే దానికి నీటి చిలకరింపు గాని, కుమ్మరింపు గాని సూచించే ఉదాహరణ ఏదైనా నీకు కన్పిస్తుందేమో.

మొదటి శతాబ్దపు సంఘంలో ముంచడం మాత్రమే ఆచరణలో ఉన్నట్టు బహుమంది చరిత్రకారులు ఏకీభవిస్తారు. చాలా కాలం తరువాతవరకు చిలకరింపు (బాప్తిస్మంగా) ప్రవేశపెట్టబడలేదు.[3] "యోహాను ఇచ్చిన బాప్తిస్మము పరలోకమునుండి కలిగినదా మనుష్యులనుండి కలిగినదా?" అని ప్రభువు ఒకసారి ప్రశ్నించాడు (మార్కు 11:30). యోహాను బాప్తిస్మము పరలోకమునుండి కలిగిందే. చిలకరింపు మరియు కుమ్మరింపు అనే ఆచారాలను గూర్చి మనం అదే ప్రశ్న అడిగినట్లయితే, "మనుష్యులనుండి కలిగాయి" అనేదే జవాబు.

## బాప్తిస్మము: "ఎవరు" పొందాలి?

బాప్తిస్మమును గూర్చిన మూడవ ప్రశ్న: "బాప్తిస్మం ఎవరు పొందాలి?" అనేది. కొన్ని మత శాఖలు శిశు బాప్తిస్మం అనేదాన్ని ఆచరిస్తారు, కాని శిశువులు పవిత్రులుగాను, పరిశుద్ధులుగాను జన్మించినందున, వారికి బాప్తిస్మం అక్కరలేదన్న సంగతిని ముందుగానే తీర్మానం చేశాం. అయితే, యింతకు బాప్తిస్మం ఎవరు పొందాలి? "బాధ్యుడైన ప్రతి వ్యక్తి" అని మనం జవాబు చెప్పవచ్చు. "మీలో ప్రతి ఒక్కడు బాప్తిస్మముపొందుడి" అని పేతురు ఆజ్ఞాపించాడు (అపొ. 2:38),[4] కాని దానికి యోగ్యత అవసరమైయుంటుంది. బాప్తిస్మమనేది కేవలం ఒక మతపరమైన కర్మ కాదు లేక వేడుకా కాదు. తమ హృదయాలను జీవితాలను సిద్ధపరచుకొన్నవారికి. తన శ్రోతలు మారుమనస్సు పొందవలసియున్నట్టు పేతురు తెలియజేశాడు (అపొ. 2:38).

ఎవరు బాప్తిస్మం పొందాలి అనే ప్రశ్నకు మనం ముందుగా పఠించిన లేఖన భాగాలే జవాబు చెప్పియుండాలి. ఈ లేఖన భాగాలను నీవు తిరిగి చదువగోరవచ్చు. ఎవరు బాప్తిస్మం పొందాలి?

- **ఉపదేశింపబడినవాడు** (మత్తయి 28:18, 19; మార్కు 16:15, 16).
- ప్రభువైన యేసునందు **విశ్వాసముంచినవాడు** (మార్కు 16:15, 16).
- తన పాపముల విషయమై **మారుమనస్సు** పొందినవాడు (అపొ. 2:36–38).
- ప్రభువునందు తన విశ్వాసాన్ని **ఒప్పుకున్నవాడు** (అపొ. 8:36–39; రోమా 10:9, 10).

ఈ రూప చిత్రానికి శిశువులు తగినవారు కారు.

ఏ ప్రాయపు వ్యక్తి బాప్తిస్మానికి పాత్రుడు? ఎప్పుడు ఒక వ్యక్తి బాప్తిస్మం పొందగల స్థితిలో ఉంటాడు? నిక్కచ్చియైన వయస్సును బైబిలు చెప్పలేదు, కాని బాప్తిస్మం పొందే

వ్యక్తి సంగతులు గ్రహించువాడై ఉండాలి:

- రక్షణ యొక్క అవసరతలో ఉన్న పాపియై ఉండాలి.[5]
- తన్ను రక్షించడానికి క్రీస్తు చనిపోయాడని ఎరిగియుండాలి.
- రక్షణకొరకైన దేవుని సంకల్పంలో బాప్తిస్మమొక భాగమైయుందని.
- తన జీవితాన్ని ప్రభువునకు వ్యక్తిగతంగా సమర్పించుకోవాలని.

## బాప్తిస్మము: "ఎవరు?"; "ఎప్పుడు?"; మరియు "ఎందుకు?"

"ఎవరు?", "ఎప్పుడు?" మరియు "ఎందుకు?" బాప్తిస్మం అనేదాన్ని రోమా 6:3-6లోని లేఖన భాగము ఉదహరిస్తుంది:

> ... క్రీస్తుయేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా? కాబట్టి తండ్రి మహిమవలన క్రీస్తు మృతులలోనుండి యేలాగు లేపబడెనో, ఆలాగే మనమును నూతన జీవము పొందిన వారమై నడుచుకొనునట్లు, మనము బాప్తిస్మమువలన మరణములో పాలుపొందుటకై ఆయనతోకూడ పాతిపెట్టబడితిమి. మరియు ఆయన మరణముయొక్క సాదృశ్యమందు ఆయనతో ఐక్యముగలవారమైన యెడల, ఆయన పునరుత్థానము యొక్క సాదృశ్య మందును ఆయనతో ఐక్యముగలవారమై యుందుము. ఏమనగా మనమికను పాపమునకు దాసులము కాకుండుటకు పాపశరీరము నిరర్థకమగనట్లు, మన ప్రాచీన స్వభావము ఆయనతో కూడ సిలువవేయబడెనని యెరుగుదుము.

బాప్తిస్మమును గూర్చి ఈ వచనాల్లోని ఉపదేశము ఈ క్రింది పటంలా సూచింపవచ్చు:




ప్రభువైన యేసు యొక్క మరణము, సమాధి, పునరుత్థానాలతో బాప్తిస్మానికి ఉన్న బాంధవ్యాన్ని గమనించు[6]

క్రీస్తు సిలువలో **మరణించాడు** (లూకా 23:33-46; ఫిలిప్పీ. 2:8). ఆత్మ

సంబంధంగా పాపములో మరణించినవాడు (ఎఫెసీ. 2:1, 5) పాపము విషయమై మృతి పొందవచ్చు (రోమా 6:11) – అది విశ్వాసం, మారుమనస్సు పొంది, ఒప్పుకొనడం ద్వారా జరుగుతుంది.

ప్రభువు **సమాధిలో** పాతిపెట్టబడ్డాడు (యోహాను 19:40–42; 1 కొరింథీ. 15:4). అలాగే, విధేయతతో కూడిన విశ్వాసి బాప్తిస్మమనే నీటి సమాధిలో పాతిపెట్టబడతాడు.

ప్రభువు మృతులలోనుండి **లేపబడ్డాడు** (మత్తయి 28:1–8; రోమా 1:4). అదే విధంగా, ఆ నీటి సమాధిలోనుండి, "నూతన జీవం పొంది" నడుచుకొనడానికి క్రైస్తవుడు లేపబడ్డాడు.

ఏదోయొక మతశాఖలో బాప్తిస్మం పొందడంవలన తప్పేముంది అని కొన్నిసార్లు జనులు నన్ను అడుగుతారు. రూలు ప్రకారం, మత శాఖల యొక్క "బాప్తిస్మం," మనం పఠించిన మూడు గుణగణాలలో ఒకటి లేక అంతకు మించి లోపిస్తాయి. ఈ "బాప్తిస్మాలు" క్రీస్తు యొక్క మరణము, సమాధి, పునరుత్థానాలతో గల సంబంధాలను పాడు చేస్తాయి:

- కొందరు శిశువులకు "బాప్తిస్మమిస్తారు" – కాని శిశువులు పాపంలో చనిపోలేదు.
- కొందరు నీటిని చిలకరించి దాన్ని "బాప్తిస్మమంటారు" కాని చిలకరింపు **పాతిపెట్ట**బడడం కాదు.
- కొందరు ముంచడం యిస్తారు, కాని అలా ముంచబడినవానికి నూతనజీవం బాప్తిస్మానికి తరువాత కాక ముందే వచ్చిందంటారు. నూతన జీవంపొంది నడుచుకొనునట్లు అనే భావన దీనిలో నశింపజేయబడింది. (వారి సిద్ధాంత ప్రకారం పాతిపెట్టేది చనిపోయిన వారిని కాదు "బ్రతికిన" వారినే.)

క్రొత్త నిబంధన బయలుపరచబడుతున్న దినాల్లో ఆచరించిన బాప్తిస్మానికి తన బాప్తిస్మము వ్యత్యాసంగా ఉన్నట్టు కనుగొన్న వ్యక్తి ఏమి చేయవలసియుంటుంది? ఈ ప్రశ్నకు అపొ. 19 జవాబును యిస్తుంది. పౌలు ఎఫెసునకు వచ్చినప్పుడు, తాను క్రైస్తవులని తలంచిన పండ్రెండుమందిని కనుగొన్నాడు. వారు యోహాను బాప్తిస్మం పొందినవారు. యోహాను బాప్తిస్మము సిద్ధపరచే బాప్తిస్మము, అది ఆ కాలానికి తగినదై ఉండింది; అయితే అది ప్రభువు ఆజ్ఞాపించిన బాప్తిస్మంచేత తొలిగింపబడింది.[7] యోహాను బాప్తిస్మము యిక చట్ట ప్రకారం చెల్లనిదైయున్న కాలంలో ఆ పన్నెండు మంది యోహాను బాప్తిస్మమును పొందియున్నారు.[8] ఆ బాప్తిస్మంలో "ఎలాగు?," "ఎవరు?" అనేవి నిజమే గాని, "ఎందుకు" అనేది నిజము కాదు.[9] పౌలు వారికి యింకను బోధించగా, వారు "ప్రభువైన యేసు నామమున బాప్తిస్మము పొందిరి" (అపొ. 19:5).

## ముగింపు

ఈ సందర్భంలో, నీ బాప్తిస్మాన్ని క్రొత్త నిబంధన బాప్తిస్మంతో పోల్చుకోవచ్చు. ఈ

పఠనారంభంలో నీవు పూరించిన ప్రశ్నా పత్రాన్ని జ్ఞాపకం చేసికో. నీ సొంత జవాబును చూడు. నీ మీద కొద్దిగా నీళ్లు చిలకరింపబడ్డాయా లేక నీవు "ముంచడం" పొందావా? నీవు శిశువుగా ఉన్నప్పుడు ఎవడైనా నీకు "బాప్తిస్మమిప్పించాడా?" నీవు ఏమి చేస్తున్నావో సరిగా ఎరుగలేని పసి ప్రాయంలో నీవు అలా చేసిన అవకాశముండిందా? నీకు వయస్సు వచ్చి, వ్యక్తిగతంగా సమర్పించుకునే పరిస్థితి ఏర్పడినప్పుడు, బాప్తిస్మంతో అవసరం లేని ఒక కర్మగా నీవు బోధింపబడ్డావా? ఉదాహరణకు, బాప్తిస్మానికి ముందే నీవు రక్షింపబడినట్టు బోధింపబడ్డావా?

నిన్ను బాధపెట్టాలని గాని, నీవు చెడుగా భావించేలా చేయాలని గాని ఈ ప్రశ్నలు అడగడంలో గల ఉద్దేశం కాదు. నిత్యరక్షణ పొందే దానికంటే ప్రాముఖ్యమైనదేదియు లేదనే యివి అడగడం జరిగింది. ఆత్మ యొక్క రక్షణ విషయంలో జూదం ఆడడానికి ఎవడూ యిష్టపడడు (యిష్టపడ కూడదు).

క్రొత్త నిబంధన నమూనాలో నీవు బాప్తిస్మం పొందకపోయినట్లయితే, అపొ. 19లో ఉన్న యథార్థమైన శిష్యులవలె ఉండి: ముంచడం పొందు (తిరిగి–ముంచడం పొందు) ఈసారి బైబిలు ఎలా చెప్పిందో అలాగే చేయ వెనుకాడకు.

---

సూచనలు

[1]ఆత్మ సంబంధమైన సకల ఆశీర్వాదములు "క్రీస్తునందు" ఉన్నాయి (ఎఫెసీ. 1:3). ఎలా క్రీస్తులో ప్రకాశించాలో రెండు లేఖన భాగాలు తెలుపుతున్నాయి: గలతీ. 3:27 మరియు రోమా 6:3; క్రీస్తులోనికి బాప్తిస్మం పొందినట్లు చెప్పుతున్నాయి. [2]దానికి భిన్నంగా, కొన్నిసార్లు జనులకు నేను మురికి గుంటలోనే బాప్తిస్మమియ్యవలసి వచ్చింది, ఎందుకంటే ముంచడానికి లభ్యమైన చోటు అదే. [3]1600 వరకు ముంచడం స్థానంలో చిలకరించడమనేది అధికారపూర్వకంగా అంగీకరింపబడలేదు. చిలకరింపుకు అధికారమిచ్చింది రోమన్ కథోలిక్ సంఘం. [4]ఒత్తి పలకడం నాది. [5]ఈ ప్రచురణలో "లెక్క చెప్పవలసిన వయస్సు" అనే దాని నోట్సు చూడు. [6]సువార్త యొక్క కేంద్ర స్థానము ప్రభువైన యేసు యొక్క మరణము, సమాధి, పునరుత్థానం అనేవి (1 కొరింథీ. 15:1–4). [7]ప్రభువైన యేసు ఆజ్ఞాపించిన బాప్తిస్మం అంటే – "ఘనత్వముగల ఆయన ఉత్తరువు"లో ఆయన ఆజ్ఞాపించిన బాప్తిస్మమని నా భావం (మత్తయి 28:18–20; మార్కు 16:15, 16). [8]యోహాను బాప్తిస్మము మాత్రము ఎరిగిన అపొల్లోచే వారు బోధింపబడి బాప్తిస్మము పొందియుండవచ్చు (అపొ. 18:25) ప్రిస్కిల్ల అకులలచే అతడు బోధింపబడేవరకు అపొల్లో అలాగే జరిగించి ఉండవచ్చు (అపొ. 18:26). [9]ఆ బాప్తిస్మం యొక్క ఉద్దేశంలో లోపించినది – క్రొత్త నిబంధన బాప్తిస్మంలోవలె యోహాను బాప్తిస్మములో పరిశుద్ధాత్మ అను వరము చేర్చబడలేదు (అపొ. 2:38).